క్లుప్తంగా

వంగరలో నేత్రవైద్య శిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి జాక్సన్

వంగర: తిరుపతికి చెందిన నవజీవన్ సేవా సంస్థ సహకారంతో జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించా రు. శిబిరానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన 135 మందికి విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి జె.జాక్సన్ కంటి పరీక్షలు చేశారు. వీరిలో 62 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ, తదితరులు సహాయ సహకారాలు అందించారు.

తూర్పు భాగవతం కళాకారుడికి సత్కారం



బొంతల కోటిని సత్కరిస్తున్న కళాకారులు, తదితరులు

బొబ్బిలి: తెలంగాణ, రాజస్థాన్, కలకత్తాలలోని వివిధ కళా సంస్థలు గుర్తించిన పురాతన కళ అయిన తూర్పుభాగవతం కళాకారుడు బొంతల కోటి శంకరరావు ను స్థానిక కోటలో ఆదివార సత్కరించారు.రాజస్థాన్‌కు చెందిన ఈసస్ చారిటబుల్ ట్రస్ట్ ఇటీవల శంకరరావుకు భారత గౌరవ అవార్డు ప్రదానం చేయగా, కలకత్తా వెల్‌ఫేర్ ఫౌండేషన్ రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత సాఫల్య పురస్కారమందించారు. అలాగే తెలుగు సంస్కృతి,సాహితీట్రస్ట్ హైదరాబాద్ కూడా జాతీయ పురస్కారాన్ని అందించిందని నిర్వాహకులకు బొంతల కోటి శంకరరావు తెలియజేశారు. కార్యక్ర మంలో ఎమ్మెల్యే బేబీ నాయన, పలువురు సాహితీవేత్తలు,కళాకారులు, సామాజిక సేవకులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



శతాబ్ది ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న వక్తలు

బొబ్బిలి: పట్టణంలోని లోకబంధు రెసిడెన్సీలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వ్యాపారవేత్త గ్రంధి ముత్యాలు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవాహ రాజశేఖర్, విభాగ్ కార్యకారిణి కె.వి.రమణ పాల్గొని ప్రసంగించారు. వందేళ్ల క్రితం విజయదశమి రోజున నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రారంభమైందని, ఆ తర్వాత జరిగిన పరిణామాలను వివరించారు.

పంట నష్ట పరిహారం అందించండి



పుర్లిలో తహసీల్దార్ కృష్ణలతకు సమస్యను వివరిస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని నాగావళి నదీ పరివాహక గ్రామాలైన పుర్లి,బొడ్డవలసలో తహసీల్దార్ ఐ.కృష్ణలత ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజల సమ స్యలను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. విస్తారంగా కురిసిన వర్షాల వల్ల పంటపొలాలు కొంత మేర నీటమునిగాయని, వాటిని అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు తహసీల్దార్‌ను కోరారు.నాగావళి వరద ఉధృతితోపాటు పంటపొలాల్లో వరద నీరు తగ్గిందని, వ్యవసాయశాఖ అధికారులు పంటలను పరిశీలించి నష్టం అంచన వేస్తారని తహసీల్దార్ రైతులకు చెప్పారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేదల ఆకలి తీర్చడంలోనే సంతృప్తి



పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న వెంకటరమణ

వంగర: పేదల ఆకలి తీర్చడంలోనే నిజమైన సంతృప్తి ఉందని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ తెలిపారు. తిరుపతి నవజీవన్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ కె. శ్రీధర్ ఆచార్య సహకారంతో అమృత కలశం పేరిట కొప్పరవలస గ్రామంలో 15 పేద కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సత్యసాయి నిత్య అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమంలో భాగంగా కొప్పరవలస రోజూ 20 మంది పేదలకు క్యారేజీల ద్వారా భోజనం అందిస్తున్నామన్నారు. అలాగే తిరుపతి నవజీవన్ ట్రస్టు సహకారంతో ప్రతీ నెల దివ్యాంగులు, వృద్ధులు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని వివరించారు. సాయిసేవాదళ్ సభ్యులు తూముల యోగేంద్ర, సాంగ అప్పలనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణ కలేనా..?

- రాష్ట్ర విభజనకు ముందు రాజాం–వంగర, రాజాం–సంతకవిటి రహదారుల విస్తరణకు నిధులు మంజూరు
- 7 కిలోమీటర్ల వరకే జరిగిన వంగర రోడ్డు పనులు
- అప్పట్లోనే ప్రారంభం కాని సంతకవిటి రోడ్డు విస్తరణ
- పుష్కరమవుతున్నా మళ్లీ వాటి ఊసేలేదు.
- రహదారుల విస్తరణ చేపడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు



విస్తరణ జరగకపోవడంతో ఇరుకుగా ఉన్న సంతకవిటి రోడ్డులో వాహన రాకపోకలు ఇలా..



విస్తరణకు నోచుకోని వంగర రోడ్డు



రాజాం- వంగర రోడ్డులో అతికష్టం మీద మలుపు తిరుగుతున్న బస్సు

రాజాం సిటీ: ఎన్నో ఏళ్లుగా రాజాం నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న రాజాం–వంగర, రాజాం–సంతకవిటి మండలాల డబుల్ రోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ రెండు రోడ్ల విస్తరణకు అధికారులు ప్రతిపాదనలు పంపించగా, విస్తరణ పనులకు అప్పటి ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. రాజాం–వంగర రోడ్డు విస్తరణకు రూ. 20కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 20 కిలోమీటర్లు మేర రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ బూరాడ జంక్షన్ నుంచి అరసాడ వరకు ఏడు కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. అక్కడ నుంచి మరో 13 కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. రాజాం- సంతక విటికి 18 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.20 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభం కాలేదు. పనులు చేపట్టకపోవడంతో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కి మళ్లిపోయాయి. పనులు నిలిచిపోయి దశాబ్దం గడిచిపోయింది. రహదారుల విస్తరణ విషయం అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పూర్తిగా మరచి పోయారు. అలాగే రేగిడి మండలంలో సోమరాజుపేట, అంబకండి గ్రామాల మీదుగా గుళ్లసీతారాంపురం వరకు రోడ్డు విస్తరణ అంశం కూడా ఉమ్మడి రాష్ట్రంలోనే తెరపైకి తీసుకొచ్చి వదిలేశారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ఈ రోడ్ల విస్తరణ చేపడతామని, గతంలోనూ తన హయాం లోనే రాజాం నియోజక వర్గం ఎంతో అభివృద్ధి చెందిందని కూటమి అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ గొప్పలు చెప్పుకున్నారు. ఆయన ఎమ్మెల్యే అయ్యి ఏడాదిన్నర కావస్తున్నా రోడ్ల విస్తరణ విషయం పట్టించుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు రహదారుల విస్తరణ అంశాన్ని కూటమి నాయకులు వాడుకు న్నారని, అధికారం చేజిక్కాక హామీలను గాలికివదిలేశారని ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు, నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. రాజాం నుంచి సంతకవిటి, వంగర, రేగిడి మండలాలకు వెళ్లే రోడ్లు ఇరుకుగా ఉండడం, వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

సంతకవిటి నుంచి పొనుగుటివలస జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం, సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలి.

– జి.రాంబాబు, ప్రయాణికుడు, రేగిడి మండలం

ప్రమాదాలు సంభవిస్తున్నాయి

రాజాం–వంగర రోడ్డులో ఎక్కడికక్కడ మలుపులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వంగర వరకు రోడ్డు విస్తరణ పనులు ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమై నప్పటికీ అరసాడ వరకే చేపట్టారు. మిగిలిన 13 కిలోమీటర్ల మేర పనులు అలాగే నిలిచిపోయాయి. రోడ్డు విస్తరణ చేపడితేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది.

– కె.ఉమామహేశ్వరరావు, వంగర

ప్రతిపాదనలు లేవు

వంగర, సంతకవిటి రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదనలు లేవు. గతంలో రెండు రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ కోర్టు వివాదం కారణంగా పనులు ముందుకు సాగలేదు.

– వి.నాగభూషణరావు, ఆర్అండ్‌బీ జేఈ, రాజాం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2002 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగింది.23 ఏళ్ల తర్వాత మిత్రులంతా కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

సకాలంలో అందని రేషన్ సరుకులు



రాజాం: రాజాం, సంతకవిటి మండలాల్లో పలు రేషన్ డిపోల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం వరకు ప్రారం భం కాలేదు. ఈ రెండు మండలాలకు చెందిన 120 రేషన్ దుకాణాలకు రాజాం ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి సరుకులు ప్రతీ నెల 30వ తేదీలోగా చేరుకోవాలి. అక్టోబర్ నెలకు సంబంధించిన సరుకుల సరఫరాలో ఎంఎల్ఎస్ కేంద్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా జాప్యం జరిగింది. రాజాం ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి రాజాంలో 62, సంతకవిటిలో 58 రేషన్ దుకాణాలకు సరుకులు సరఫరా చేయాల్సి ఉంది. రాజాంలో 19, సంతకవిటిలో 17 దుకాణాలకు సరుకులు సరఫరా కాకపోవడంతో ఆ దుకాణాల పరిధిలో పంపిణీ ప్రారంభించకపోవడంతో లబ్ధిదారుల్లో అలజడి ప్రారంభం అయ్యింది. రాజాం తహసీల్దార్ ఎం.రాజశేఖరం కలుగుచేసుకుని ఆదివారం నాటికి పెండింగ్‌లో ఉన్న కేంద్రాలకు సరుకులు సరఫరా చేయించారు. సోమవారం నుంచి అన్నిచోట్ల సరుకులు పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఎంఎల్ఎస్ కేంద్రం వద్ద జాప్యం కారణంగా ఈ సమస్య వచ్చిందని తమ దర్యాప్తులో తెలిసిందని, ఉన్నతాధికారులకు నివేదికలు అందించామని వెల్లడించారు. సాంకేతిక సమస్యల కారణంగా సరుకులు సకాలంలో చేరలేదని అన్నారు.

బోధనారంగం వైపు ఆకర్షితులయ్యేలా చొరవ చూపాలి



రిటైర్డు ఉపాధ్యాయులకు సత్కారం

బొబ్బిలి: నేటి యువత బోధనా రంగం వైపు ఆసక్తి చూపడం లేదని, ఈ రంగానికి యువత ఆకర్షితులయ్యేలా ప్రభుత్వాలు చొరవ చూపాలని రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామమూర్తినాయుడు అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పట్టణం లోని కోటలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలూ అభివృద్ధి చెందాలంటే వాటిని విద్యార్థులకు తెలియజెప్పే ఉపాధ్యాయ రంగం ముఖ్యమైనదని అన్నారు. కానీ ఈ వృత్తిలోకి కాకుండా అత్యధిక వార్షిక వేతనాల కోసం ఇంజినీరింగ్, ఇతర సాంకేతిక రంగ ఉద్యోగాలపై యువత ఆసక్తి పెంచుకుంటున్నారన్నారు. దీంతో ఉపాధ్యాయ విద్య, బోధనా రంగానికి దూరమవుతున్నారని ఆవేదన చెందారు. ఏఐ వచ్చాక ఈ పరిస్థితి మరింత ఆందోళనకర స్థితిలోకి వెళ్తుందన్నారు. దీనిని నివారించాలంటే బోధనా రంగానికి యువత ఆకర్షితులయ్యేలా జీతభత్యాలు, సౌకర్యాలను ఇతర రంగాలతో సమానంగా ఇచ్చేలా ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్యే బేబీ నాయన చేతుల మీదుగా రిటైర్డు ఉపాధ్యాయులను సత్కరించారు. మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణంలో అష్టకష్టాలు



బస్సు వద్దకు పరుగుతీస్తున్న ప్రయాణికులు



బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం రద్దీ సమయాల్లో సరిపడా బస్సులను నడపడంలో విఫలమవడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యాలు,అవస్థలకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న పట్టణ, చుట్టుపక్కల ప్రాంతాల వారు దసరా పండగకు స్వగ్రామాలకు వచ్చి తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ, విజయవాడ, హనుమాన్ జంక్షన్,గుడివాడ,రాజమండ్రి,తెలంగాణ ప్రాంతాల్లో వివిధ పనులు, ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన వారు దసరా పండగకు వచ్చినప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు పడుతున్నామని వాపోతున్నారు. రద్దీ సమయాల్లో సరిపడా బస్సులు వేయకపోవడంతో వచ్చే ఒకటీ అరా బస్సుల్లో నెట్టుకుంటూ సీట్ల కోసం ఆదుర్దా పడుతున్నారు. మరోపక్క ఈ ప్రయాసల సమయంలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు పలు అవస్థలకు గురవుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, వివిధ బస్టాపుల వద్ద ఫ్రీబస్సు అనుకుని పలువురు మహిళలు టిక్కెట్ తీయాల్సిన బస్సులు ఎక్కడం అందులో ఉండే కండక్టర్ వారిని అల్లంత దూరంలో మళ్లీ దించేయడంతో లగేజీలతో తిరిగి కాంప్లెక్స్‌కురావాల్సి వస్తోంది. పక్క స్టాప్‌లో దిగిపోతామని చెప్పినా మా ఉద్యోగాలు పోతాయని కండక్టర్, డ్రైవర్లు చెబుతుండడంతో విధిలేక వారు ఎక్కడ దించేస్తే అక్కడే దిగి ఉసూరు మంటూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. ఏది ఫ్రీ బస్సు, ఏది టిక్కెట్ బస్సు అన్న అనౌన్స్‌మెంట్ లేకపోవడం వల్ల ఈ ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విద్యార్థులను బస్టాప్ వద్ద కాకుండా ముందుగానో లేక అల్లంత దూరం వెళ్లిపోయాక దించేయడంతో వారూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల ఆరికతోటకు ఉన్న రెండు బస్సు స్టాపుల మధ్యలో రాత్రి వేళ విద్యార్థినులను దించేయడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఆర్టీసీ సిబ్బందికి ఇంత నిర్లక్ష్యం పనికి రాదని వారి కుటుంబ సభ్యులు, పిల్లలయితే ఇలానే చేస్తారా అని ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది



బొబ్బిలి: ఉపాధ్యాయుడు జె.సి.రాజును సత్కరిస్తున్న రోటరీ క్లబ్, కారుణ్య సంస్థల సభ్యులు

బొబ్బిలి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పలువురు వక్తలు అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్స వాన్ని ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు, రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్, కారుణ్య సంస్థ అధ్యక్షుడు జె.సి.రాజును రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు.రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శివకాంత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ, కారుణ్య సంస్థల సభ్యులు సింధ్రీ శ్రీనివాసన్,ప్రవీణ్, శ్రీనివాసరావు, రామకృష్ణ, శంకరరావు, చుక్క శ్రీదేవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు నేతాజీ, పారినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



రేగిడి: బెవర లవకుశను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్,తదితరులు

రేగిడి: అనారోగ్యంతో బాధపడుతున్న కొండవలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెవర లవకుశను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకుని పార్టీకి సేవలందించాలని కోరారు. అలాగే గ్రామానికి చెందిన బెవర రామారావు మాస్టారు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ రేగిడి మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, నాయకులునెల్లి పెంటన్నాయుడు, కెల్ల మన్మథరావు, నెల్లి సుగుణాకరరావు, బెవర జగన్నాథం, బెవర సత్యం, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తెర్లాం: నెమలాం గ్రామానికి చెందిన, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోను అప్పలనాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు సత్యంనాయుడు, తదితరులు ఆదివారం పరామర్శించారు.

కూటమిపై పోరుబాట

- ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ఊపందుకున్న ఉద్యమాలు
- ఈనెల 7వ తేదీన చలో విజయవాడకు ఫ్యాప్టో పిలుపు



రామభద్రపురం ఎమ్మార్సీ వద్ద నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు(ఫైల్)

రామభద్రపురం: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఎన్నికల హామీలు అమలు కాకపోవడంపై విద్యార్థుల నుంచి రైతులు,అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు,ఇతర శాఖల ఉద్యోగులు ఒక్కొక్కరూ నిరసన గళం విప్పుతున్నారు. నిరసన తెలపడంతో పాటు ధర్నాలు చేస్తున్నా కూటమి సర్కార్ స్పందించడం లేదు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు కూడబలుక్కుని ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమయ్యాయి. ఆర్థిక బకాయిల చెల్లింపులు, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాలకు దిగాయి.గత నెలలో ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన వారం,అలాగే అదే నెలలో 17వ తేదీన రణభేరి జాత పేరుతో యూటీఎఫ్ చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి.ఫ్యాప్టో నేతలంతాఇటీవల నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.మండల,డివిజన్,జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులుఇచ్చారు. ఈనెల 7వతేదీన చలో విజయవాడకు పిలుపునిచ్చారు. విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా ఏంటో చూపిస్తామని ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. మరో వైపు తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయవాడ ధర్నాచౌక్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నారు. ఏడాదిన్నరగా ఎన్నో వేధింపులను భరిస్తూ వచ్చిన గ్రామ సచివాలయ ఉద్యోగుల్లోనూ సహనం నశించింది.ఇంటింటికీ వెళ్లి వాట్సాప్ సేవలపై ప్రచారం చేసే ప్రసక్తి లేదని,అవసరమైతే నిరవధిక సమ్మెకు సిద్ధమని ప్రభుత్వానికి తెలిపారు.

టీచర్ల డిమాండ్‌లలో కొన్ని..

- పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలి
- సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి
- 12వ పీఆర్సీ ఏర్పాటు, ఐఆర్ ప్రకటించాలి
- అన్ని రకాల బకాయిలను తక్షణం చెల్లించాలి
- బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి
- ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలి

పీహెచ్‌సీ వైద్యుల ప్రధాన డిమాండ్లు

- అన్ని విభాగాల్లో 20శాతం ఇన్‌సర్వీస్ సీట్లు కొనసాగించాలి
- టైమ్‌బౌండ్ ఉద్యోగోన్నతి ప్రకటించాలి. డీసీఎస్,సీఎస్ ఉద్యోగోన్నతికి కాలపరిమితి నిర్ణయించాలి.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు అలవెన్స్‌లు మంజూరు చేయాలి
- సంచార వైద్య సేవలకు సదుపాయాలు కల్పించాలి

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు..

- విధులకు సంబంధం లేని సర్వేలు,ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలి
- శాఖల వారీగా మాతృశాఖలో విలీనం చేయాలి
- సచివాలయాల్లోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఒకే బేసిక్ తో పదోన్నతి కల్పిస్తూ పీఆర్సీ స్లాట్ వర్తింపజేయాలి
- సెలవు రోజుల్లో బలవంతపు విధుల నుంచి విముక్తి కలిగించాలి.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



ఉద్యోగ,ఉపాధ్యాయుల అండతో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి వారి సమస్యలను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఉద్యోగ,ఉపాధ్యాయ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఏ ఒక్కరూ ప్రభుత్వం తీరుపై సంతోషంగా లేరు. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించేంతవరకూ పోరాడుతూనే ఉంటాం.

– జె.సి.రాజు,ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు

నమ్మి ఓట్లేసినందుకు వంచన



నమ్మి ఓట్లేసి గెలిపించిన ఉద్యోగ,ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం దారుణంగా వంచిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్న అవుతున్నా ఉపాధ్యాయుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్క రోజు కూడా చర్చించిన పాపాన పోలేదు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతోంది.నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూనే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రైవేటుకు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.

– కె విజయగౌరి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు

టీచర్ల సత్తా చూపిస్తాం



విద్యా సంస్కరణల పేరుతో టీచర్లను ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదు.టీడీపీ కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆర్థిక,విద్యారంగ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలు ఉధృతం చేసి తమ సత్తా ఏమిటో చూపిస్తాం.

– ఎం.బలరాంనాయుడు,ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు